ఆ మరునాడే ఇంట్లో వ్రతం, ఊళ్ళో వాళ్ళు కూడా చాలా మంది రావటం.. హడావుడి జరిగింది. వీలైనంత వరకూ అందరికీ కొంచెం దూరం దూరంగానే ఉంటున్నా, కొందరి గుసగుసలు చెవిన పడ్డాయి.

"పెద్ద కోడల్ని... చూశావుగా..?"

"కోడలని అనకు... మీనాక్షమ్మ వింటే మండిపడిపోతుంది! ఇప్పటి వరకూ అత్తాకోడళ్ళ మధ్య మాటలే లేవట..!"

"అవును మరి.. శ్రీలక్ష్మి ఉసురు పోసుకుంది.."

"అడుగు పెట్టిందగ్గర్నుండి.. అనర్థాలేనట... అత్తాకోడళ్ళ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందట!" బాగా గొంతు తగ్గించే అలా మాట్లాడుకుంటున్నారు కొందరు. గుసగుసలే అయినా నాకూ వినిపించాయంటే.. వాళ్ళ ఉద్దేశం కూడా వినిపించాలనే కాబోలు! కొందరికి అదో ఆనందం...!

పుట్టిందంటే.. పురుగులు పట్టిందని చెప్పుకుంటారనే సామెతను వాళ్ళ మాటలు నిజం చేస్తున్నాయి! వీళ్ళందరూ ఏమనుకుంటే ఏమిటి.. అత్తయ్య ఆంతర్యం.. నాకు జ్వరం వచ్చినప్పుడు స్పష్టంగా తెలిసింది కదా! శ్రీలక్ష్మి మరణానికి కుమిలి పోవటంలో మామూలుగా ఉండలేకపోవటమే తప్ప నా మీద ప్రత్యేకంగా కోపం, నిష్ఠూరం లేనే లేవు! మొదట్లో నన్ను పలుకరించలేదని కొంచెం అభిమానపడ్డానే గానీ.. ఇప్పుడు మాత్రం పలకరింపులు లేకపోయినా అత్తయ్యంటే గౌరవం, ఆత్మీయతా ఉన్నాయి! అత్తయ్య వ్యక్తిత్వానికి.. ప్రేమించే మనసుకూ.. నేను అభిమానిని కూడా!

పెళ్ళి సందడి అంతా సద్దు మణిగింది.

బంధువులందరూ వెళ్ళిపోయారు. పదిహేను రోజుల్లోనే రజిత కాపురానికి వచ్చేసింది. నీరజ ఎక్కువగా కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి వస్తూంటుంది. ఇంట్లో ఎక్కువగా ఉన్నట్లే ఉండదు. రజిత ఇంట్లోనే ఉంటుంది కాబట్టి నాకు కాలక్షేపం బాగా ఉంటుందనుకున్నాను. అందులోనూ వచ్చిన రోజే ఏ అరమరికలూ లేకుండా నన్ను పలకరించింది కూడా కదా!

రజిత వచ్చిన మర్నాడే ఉదయం వేళ కోదండం గారు హడావుడిగా వచ్చారు. అప్పటికి నేనూ, రజితా ఇంకా డైనింగు టేబుల్ దగ్గరే కూర్చుని ఉన్నాం. అత్తయ్య, కృష్ణప్రసాద్ పక్క వరండాలో ఉయ్యాల బల్ల దగ్గిరున్నారు. విష్ణు ఆఫీసుకి వెళ్ళి చాలా సేపయింది.

కోదండంగార్ని మొదటిసారి చూసిన తర్వాత మళ్ళీ రెండు మూడు సార్లు ఇంటికి వచ్చారు గానీ నాతో మాటలేం లేవు. పలకరించినట్లుగా చిరునవ్వుతో చూసి పక్కకు వెళ్లిపోయాను. ఆయనా అంతే.

ఆయన "మీనాక్షీ... మీనాక్షీ..." అని పిలుస్తూ అత్తయ్యా వాళ్ళు కూర్చున్న వేపుకి వెళ్ళారు.

"ఆ గురుస్వామి ప్లాటు మనకే ఇస్తానని చెప్పి నాలుగు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొమ్మని నాకు ఫోను చేసి చెప్పాడు!" ఆయన గొంతు ఖంగుమంది.

అత్తయ్య, కృష్ణప్రసాద్ ఒక్కసారే "నిజంగా..?" అనటం వినిపించింది.

"అవును.. ఆ రోజు రేటు పెంచుతామని అన్నా వినకుండా మొండికేసినవాడు ఇప్పుడు తనంతట తానే రేటు కూడా పెంచకుండా అదే రేటుకి ఇస్తానంటున్నాడు!"

"ఏమయితేనేం మనకి ఒక సమస్య తీరినట్లే! మంచి చోట అలాంటి ప్లాటు దొరుకుతుందా అని ఆందోళన పడ్డాను. కాని ... చేజారిందనుకున్న ఆ ప్లాటు మళ్ళీ మనకే దక్కుతుందన్నమాట!" కృష్ణప్రసాద్ గొంతులో ఆనందం స్పష్టంగా తెలిసిపోతోంది.

"ఆ గురుస్వామి... తిక్కమేళంలా ఉన్నాడే! లేకపోతే ఇన్నిసార్లు మాట మార్చటం ఏమిటి? ఇప్పుడైనా ఇంకా ఆలస్యం చేయకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవటం మంచిది" చిన్నత్తయ్య మాటలు.

డైనింగ్ హాలుకి, వరండాకీ ఉన్న ద్వారం దగ్గర నిలుచున్న కోదండం గారు కొంచెం పెద్ద గొంతుతోనే అన్నారు. "ఒక్కోసారి మన ఎంత ప్రయత్నించినా జరగని పని మన టైము బాగున్నప్పుడు ప్రయత్నం చేయకపోయినా జరిగిపోతుంది! నా పెద్ద కూతురిదే కాదు, చిన్న కూతురు జాతకానికీ తిరుగులేదు! మంచికైనా, చెడుకైనా కోడలొచ్చినవేళ అంటారందుకే!"

కృష్ణప్రసాద్ మాటలు విసురుగా వచ్చాయి. "మామయ్యా... ఆ ప్లాటు మనకి దక్కిందని నువ్వు చెప్పిన విషయం బాగుంది. కానీ దానికి అనవసరమైన రంగులు వేయటం మాత్రం బాగా లేదు."

"అదేమిట్రా.. ఇందులో నా సొంత పాండిత్యం ఏముందీ! పెద్దలన్న మాటనే కదా నేనూ అన్నాను! అంతెందుకూ మన ఊరి వాళ్ళందరూ నీ పెళ్ళిలో ఏమన్నారు? బావని అవస్థ పెట్టి పెళ్ళికి తీసుకెళ్ళటం ఎందుకూ, ఆయనకేమైనా తెలుస్తుందా అనుకున్నాను. కానీ.. ఏదో కొంచెం అవస్థపడి తీసుకెళ్ళినందుకు మంచి ఫలితమే కనిపించిందిగా! మీ నాన్న మొహంలో మార్పు వచ్చిందని, మొహంలో ఆనందం కనిపించిందని అందరూ అనలేదూ? పిల్ల మెడలో మూడు ముళ్ళుపడి మీ ఇంటి కోడలైన వేళ నుండే మంచి జరగటం మొదలైందనీ, ఇక మీ నాన్న ఆరోగ్యం బాగుపడే సూచనలు కూడా కనిపిస్తున్నాయని అందరూ అనుకుంటుంటే నాకూ విచిత్రంగా

అనిపించి నవ్వొచ్చింది! కానీ ఈ రోజు మాత్రం గురుస్వామి మనసు మార్చుకుని మనకే స్థలం ఇస్తానని అనటంతో వాళ్ళ మాటల మీద కొంచెం నమ్మకం కలిగి ఆనందంగా ఉంది!"

రజిత లేచి కోదండం గారి పక్కకెళ్ళి కృష్ణప్రసాద్‌తో అంది "మంచి కబురు తెచ్చిన సంతోషంలో నాన్న నా గురించి మంచిగా అంటే.. నువ్వు సంతోషించాలి గానీ కష్టంగా మాట్లాడుతున్నావేంటి బావా?"

"ఎందుకో చెప్పమంటావా? మంచికే కాదు, చెడుకి కూడా నిన్ను బాధ్యురాల్ని చేయటం నాకిష్టం లేదు మరి! నిన్ననే నా పర్సు.. పదివేలున్నాయందులో... ఎక్కడో పడిపోయింది! నేను కొన్న షేర్లలో రెండు లక్షలు నష్టమూ వచ్చింది! నువ్వు అడుగుపెట్టిన వేళావిశేషం అనటం నాకు బాధగా ఉండదా చెప్పు...?" కృష్ణప్రసాద్ మాటలలో నవ్వు వినిపించింది.

"నువ్వు కావాలనే అబద్ధాలు చెబుతున్నావ్! ఎవర్ని వెనకేసుకుని ఇలా మాట్లాడుతున్నావో నాకర్థం అయిందిలే.." విసురుగా వచ్చి మళ్ళీ డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని తన కాఫీ కప్పు చేతిలోకి తీసుకుంది.

కృష్ణప్రసాద్ అక్కడ నుండి లేచి వచ్చి వెళ్ళిపోబోతూ ఒక క్షణం ఆగి రజిత వేపు చిరునవ్వుతో చూసి "ఎవర్ని రజితా.. అబద్ధాలు చెబుతున్నారంటున్నావ్? నన్నా... మీ నాన్ననా..?" అన్నాడు.

రజిత నల్లబడిన మొహంతో మిర్రి మిర్రి చూసింది. అదేం పట్టించుకోనట్లుగా కృష్ణప్రసాద్ చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

కోదండం గారు వచ్చి నా పక్క కుర్చీ లాక్కుని కూర్చుంటూ గట్టిగా నిట్టూర్చారు. "ఏదైనా ముక్కు సూటిగా మాట్లాడటం నా అలవాటమ్మా. ఏదో మాట్లాడటమేకానీ ఆ మాటలకి ఇంకో రకం అర్థాలు కూడా ఉంటాయేమోనని ఆలోచించకపోవటం... నాది తప్పే.. ఒప్పుకుంటాను! జనాలు ఏదో అనుకుంటే అనుకుంటారు గానీ... నేనూ.. అలాంటి మాటల్ని నమ్మను... లెక్కచేయను! నువ్వూ నాకు పెద్దకూతురులాంటి దానివే.. నువ్వేం మనసు కష్టపెట్టుకోకమ్మా! కృష్ణ అనే వరకూ నా మాటల వల్ల నీ మీదకు నింద వస్తుందనే ఆలోచనే నాకు లేకపోయింది మరి!"

ఆయన చూపులో, గొంతులో కనిపించిన, వినిపించిన ఆప్యాయతకీ, అభిమానానికీ నేను నిర్విణ్ణురాలినైపోయాను.

ఆయన మాటలు నిజంగా నిజమైతే.. ఆ అభిమానానికి శిరసు వంచాల్సిందే!

నటన అయితే.. ఆయనలోని మహా నటుడికి జేజేలు పలకాల్సిందే!!

రజిత లేచి నిలబడి తన ఆగ్రహమంతా కుర్చీమీద చూపిస్తూ గట్టిగా లాగి వెళ్ళిపోయింది. ఆ వెనుకే కోదండంగారు వెళ్ళారు.

లేవలేనట్లుగానే రెండు నిముషాలు అలాగే కూర్చుండిపోయాను. ఆ పరిస్థితి చాలా ఇబ్బందిగా, అవమానకరంగా అనిపించింది!

ఆ గురుస్వామి ఎవరో గానీ ఎందుకని కొన్నాళ్ళ క్రితం బేరం కుదుర్చుకున్న స్థలాన్ని అమ్మనని మొండికేశాడో, మళ్ళీ ఇప్పుడు మనసు మార్చుకుని ఎందుకని సరే అన్నాడో తెలియదు గానీ కోదండం గారు మాత్రం నా నష్టజాతకం వల్లే అప్పుడలా, రజిత అదృష్ట జాతకం వల్లే ఇప్పుడిలా జరిగిందన్నట్లుగా తేల్చి చెప్పారు! కాకపోతే... అది తన మాట కాదంటూనే నొక్కి వక్కాణించారు! వగచినట్లూ, వాత పెట్టినట్లూ మాట్లాడటమంటే అదే! ఆయనకి అలవాటైన పద్ధతి!

మరికాసేపు నేనే అనవసరంగా అపార్థం చేసుకుంటున్నానేమో.. జరిగినదాన్ని బట్టి ఆయన మామూలుగా మాట్లాడినా నేనే అనవసరమైన ఆలోచనలు చేస్తున్నానా.. అనిపించింది. నాది నష్టజాతకమని నిరూపించినందువల్ల ఆయనకేం ప్రయోజనం కలుగుతుంది..? ఏమీ లేదు! అవును.. నా ఆలోచనే తప్పయి ఉండొచ్చు!

ఏది ఏమైనా గానీ.. మన ప్రమేయం లేకుండా జరిగే మంచి చెడులకు మనల్ని బాధ్యుల్ని చేయటం మాత్రం చాలా పొరపాటు. కోడలొచ్చినవేళ... అనే మాట ఉండనే కూడదు! పూర్తిగా రద్దయిపోవాలి! కాకతాళీయంగా జరిగే దుర్ఘటనలకి కొత్తగా కాపురానికి వచ్చిన అమ్మాయి జాతకమే కారణమనే నిందారోపణలను తట్టుకోవటం ఎంత కష్టం..! స్వయంగా అనుభవిస్తున్నాను కనుక తెలిసి వచ్చింది కానీ.. ఈ రోజుల్లోనూ ఇలా మాట్లాడేవాళ్ళున్నారనే విషయం నాకిప్పటి వరకూ తెలియనే తెలియదు మరి!

ఇలాంటి ఆరోపణకు ఇంట్లో వాళ్ళెవరూ సానుకూలంగా స్పందించకపోవటం.. నాకు ఊరట కలిగించే విషయమే!

మన మాట.. మనసు.. ప్రవర్తన మంచిగా ఉండాలి! దానికే మనం బాధ్యత వహించగలం! మన ప్రమేయం లేకుండా జరిగే విషయాలకు మనల్ని బాధ్యుల్ని చేసి ఎవరో ఏదో మాట్లాడితే.. మనం వాళ్ళ ఆరోపణలకి బలం చేకూర్చేలా బాధపడడం అనవసరం! ఇలా నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను.

ఈ మధ్యలో కోదండంగారి రాకపోకలు ఎక్కువయ్యాయి. ఆయన ఒకటి రెండుసార్లు "శ్రీనిలయం మునుపటిలా మళ్ళీ కళకళలాడుతోంది" అనటం విన్నాను. దానికి రజితే కారణమని ఆయన ఉద్దేశ్యం కాబోలు! రజిత అభిప్రాయం కూడా అదే. తనే అంటూంటుంది. "మా ఇంట్లో వాళ్ళు నేను లేకపోతే ఇల్లు ఇల్లులాగే ఉండదంటారు.." అని "మునుపు నేను రాకముందు... ఇక్కడ ఏ సందడీ లేకుండా ఇల్లంతా బావురుమన్నట్లుగా నిశ్శబ్దంగా ఉండేదటగా?" అని నన్నడిగిందొకసారి. ఇప్పుడు ఇల్లంతా సందడిగా, ఇంట్లో వాళ్ళంతా సరదాగా ఉన్నారు.. దానికి తనే కారణమని తనకి తనే సర్టిఫికెట్ ఇచ్చుకోవటమన్నమాట! అలా ఆనందించటం మంచిదే... ఎవరికీ నష్టం లేదు!

కాకపోతే చిన్నత్తయ్య ఒకసారి రజిత గురించి అన్న మాటలు విన్నప్పుడు తమాషా అనిపించింది. "ఇద్దరూ సొంత అక్కచెల్లెళ్ళయినా ఇద్దరికీ పోలికే లేదు. శ్రీలక్ష్మి పరుగులు పెట్టినా, గలగల మాట్లాడినా, నవ్వినా అదొక తీరుగా.. అందంగా ఉండేది! ఈ రజిత సంగతేమిటో అంతా వేరే! నడుస్తుంటే ఏదో విసురు, నిర్లక్ష్యం... మట్లాడటం దడదడలాడటమే... నవ్వటమంటే అట్టహాసం పట్టపగలే...." చిన్నత్తయ్య అత్తయ్యతో అన్న ఈ మాటలు రజిత గానీ విని ఉంటే... ఇల్లు కాసేపు రణరంగమే అయి ఉండేది! రజిత ప్రవర్తన చాలా విచిత్రంగా ఉంటుంది. సరదాగా మాట్లాడుతూనే ఉంటుంది. అంతలో ఏదో ఒక మాటతో కోపం తెచ్చుకుని రెచ్చిపోతుంది!

రజిత, నీరజ నేను సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు నీరజ ఒక మాట అంది "మన ముగ్గురిలోనూ, కామన్‌గా ఒకటుంది. అది నీలో మాత్రం ఇకారమయింది. ఏమిటో చెప్పు..." నవ్వుతూ రజితనడిగింది.

ఒక క్షణం ఆలోచించగానే అర్థమైంది. మా ముగ్గురి పేర్లలోనూ 'జ' అనే అక్షరం ఉంది. అదే రజిత పేరులో 'జి' అయిందని తన ఉద్దేశ్యం అయివుంటుంది. ఆ మాటే నేను అడగబోతుండగా రజిత కోపంతో పెద్దగా అరిచేసింది. "మీ ఇద్దరిలోనూ సవ్యంగా

ఉన్నదేమిటి .. నాలో వికారంగా ఉన్నదేమిటి..? అసలు నాకూ మీకూ పోలికేమిటి? నేను మీలా పెరిగినదాన్ని కాదు. నన్ను పెంచినవాళ్ళు అరచేతుల్లో పెట్టుకొని అల్లారు ముద్దుగా పెంచారు! మీకు ఒకరికి అమ్మలేదు.. ఒకరికి అయ్యలేదు! నాకు కన్నవాళ్ళు, పెంచిన వాళ్ళు... రెండు పుట్టినిళ్ళ బలగం ఉంది...."

రజిత వాక్ప్రవాహం అలా సాగిపోతుంటే నీరజ బెదిరిపోయింది. కళ్ళనీళ్ళతో... "అయ్యో... రజితా 'జ' అనే అక్షరం 'జి' అయిందని తమాషాగా చెప్పబోయానంతే..." సర్దిచెబుతున్నా వినిపించుకోలేదు. "నన్ను వెక్కిరించేపాటిదానివి కావు...నీ లిమిట్స్‌లో నువ్వుండు" అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది.

ఆశ్చర్యం ఏమిటంటే ఆ సాయంకాలమే ఏమీ జరగనట్లుగా నవ్వుతూ పలకరించింది! తన మూడ్ ఎప్పుడెలా ఉంటుందో, ఎలా మారిపోతుందో ఎవరికీ తెలియదు! మొత్తానికి రజిత వచ్చిందగ్గర్నుండి ఇల్లు కళకళలాడటం సంగతేమో గానీ చిన్నపాటి గాలివానలు మాత్రం మామూలయ్యాయి!

## 11

మా పెళ్ళి సందర్భంగా నాన్నగారు మాకిచ్చిన డబ్బును బ్యాంకులో ఉంచి... మా పరిధిలో తెలిసిన అవసరమైన వాళ్ళకు కొంత మందికి పెళ్ళి ఖర్చులకు సహాయంగా ఇస్తుంటే బావుంటుదని నేను అన్నప్పుడు విష్ణు "చాలా మంచి ఆలోచన" అని మెచ్చుకున్నారు.

ఆ రోజు... విష్ణు "నువ్వు తలపెట్టిన మంచి పనికి ఉడతలా సాయం చేద్దామని ఒక కాండిడేట్‌ని వెతికి పట్టుకున్నాను...." అని చెప్పారు.

విష్ణు కారు డ్రైవరు రమణ చిన్నాన్న ఆ మధ్య యాక్సిడెంట్‌లో చనిపోయాడు. అతని కూతురు నాగమ్మ రమణా వాళ్ళింట్లోనే ఉంటోంది. ఆ అమ్మాయి పెళ్ళి బాధ్యత రమణా వాళ్ళదే! వాళ్ళ దగ్గర బంధువుల అబ్బాయి కాశీతో పెళ్ళి నిశ్చయం అయింది. ఆ అబ్బాయికి చిన్న ఇల్లు ఉంది. ఏదో చదవటం, రాయడం తెలుసును కానీ చదువు లేదు. ఎక్కడా నౌకరీ లేదు. కూలిపనికి వెళ్ళాల్సిందే. కట్నం డబ్బును రమణ అన్నదమ్ములు ముగ్గురు కలిసి సర్దుబాటు చేయాలి. ఆరు నెలల క్రితమే రమణ పెళ్ళి అయింది. అప్పుడు మొత్తం ఖర్చులన్నీ విష్ణుయే పెట్టారట. అందుకని ఇప్పుడు మళ్ళీ అడగలేక రమణ వేరే చోట అప్పు కోసం చూస్తున్నాడని విష్ణుతో ఇంకో డ్రైవర్ చెప్పాడట.

ఇదీ సంగతి, ఎంత ఇవ్వటం ఏమిటి అనే విషయాలన్నీ పూర్తిగా నన్నే చూసుకోమని విష్ణు చెప్పేశారు. నాకో ఆలోచన వచ్చింది.

రమణా వాళ్ళిల్లు ఆఫీసుకు దగ్గర. రమణ పెద్దవాళ్ళనీ, కాశీతో పాటు అతని తల్లిదండ్రుల్నీ ఒక రోజు ఆఫీసుకు రమ్మని చెప్పి, విష్ణుతో పాటు నేనూ వెళ్ళాను.

వాళ్ళందరూ వెనుక వరండాలో కూర్చున్నారు.

కాశీ తల్లిదండ్రులు చెప్పిందేమిటంటే.. పెళ్ళి వాళ్ళింటి దగ్గరే జరగాల్సి ఉంది. ఒక్కడే కొడుకు. కాబట్టి అందర్నీ పిలిచి ఘనంగా చేయకపోతే నలుగురిలో చిన్నతనంగా ఉంటుంది. చుట్టాలూ తప్పు బడతారు. పెళ్ళి ఖర్చులకే అంతా అయిపోతుంది. అందుకే కట్నం కొంచెం ఎక్కువే అడగాల్సి వచ్చిందని చెప్పారు.

నేను వాళ్ళకి లక్షరూపాయలు ఇవ్వాలనుకుంటున్నానని చెప్పాను. నా సలహాని వివరించాను. ముఖ్యమైన బంధువుల్ని పిలిచి వీలైనంత తక్కువ ఖర్చుతో పెళ్ళి జరపించి మిగతా డబ్బును కాశీ ఏదైనా ఉపాధి ఏర్పరుచుకోవటానికి ఉపయోగిస్తే బావుంటుందేమో ఆలోచించమన్నాను. అతనికి సంపాదన అనేది అవసరం. కొద్ది పెట్టుబడితో ఏదైనా చిన్న షాపులాంటిది పెట్టుకుంటే బావుంటుందని సలహా ఇచ్చాను.

కాశీ తల్లిదండ్రులకి నా ఆలోచన అంత నచ్చినట్లు లేదు. కానీ కాశీ మాత్రం వెంటనే చాలా ఆనందంగా స్పందించాడు.

వాళ్ళకి దగ్గరలో కిరణా కొట్టు ఏదీ లేదట. వాళ్ళ ఇంటి ముందే ఏర్పాటు చేసుకుంటే బావుంటుందనే ఆలోచన వచ్చింది కానీ పెట్టుబడికి డబ్బులేక ఊరుకున్నానన్నాడు. తప్పకుండా అలాగే చేస్తానన్నాడు.

అతని తల్లిదండ్రులకీ నేను నచ్చచెప్పే ప్రయత్నం చేశాను. ఇంట్లో జరిగే వేడుక కోసం ఉన్నదానిలోంచి కొంత ఖర్చు చేయటం మంచిది గానీ ఉన్నదంతా లేక అప్పుచేసి ఖర్చులు పెట్టటం వలన ప్రయోజనం ఉండదన్నాను. కాశీ సంపాదనలో పడి బాగా సెటిల్ అయ్యాక అప్పుడు ఏ శుభకార్యమైనా అందర్నీ పిలిచి ఘనంగా చేసుకోవటం బావుంటుంది కదా అని సూచించాను.

అతని తల్లిదండ్రులిద్దరూ కూడా అప్పుడు సంతృప్తిగా తలలూపారు. రమణా వాళ్ళ అన్నదమ్ముల్లో చాలా రిలీఫ్ కనిపించింది. అప్పు చేయాల్సిన అవసరం తప్పింది కదా! నాకూ బాగా సంతృప్తిగా, సంతోషంగా అనిపించింది! మా పెళ్ళి కోసం ఖర్చు

చేయాల్సిన అవసరం లేకపోవటంతో నాన్నగారు నాకు కానుకగా ఇచ్చిన ఆ డబ్బులో పది జంటల పెళ్ళి ఖర్చుల్ని నేను భరించగలటం మంచి విషయమేగా!

కాకపోతే ఈ విషయమే ఇంట్లో ఓ పెద్ద రభస జరగటానికి కారణమై కూర్చుంది!

యధాలాపంగా అడిగినట్లుగానే రజిత నన్నొకసారి నా నగలు చూపించమని అడిగింది. నాకు ఎక్కువగా లేవని నేనేదో చెప్పబోతుండగానే పెద్దగా నవ్వేసింది. "మీ నాన్న ...పాపం బడిపంతులని తెలుసుగా, ఆయనేం చేయించలేరని నాకెందుకు తెలియదూ! నేనడిగింది మా అక్క కోసమని అత్త చేయించిన నగలన్నీ నీకే ఇచ్చేసిందట కదా! ఆ నగల గురించి మా వాళ్ళందరూ గొప్పగా చెప్పుకోవటం విన్నాను. అవి చూద్దామని..."

విష్ణు తన ఫైళ్ళు అవీ పెట్టుకునే బీరువాలో పెట్టినవి ఏం చేశారో నాకు తెలియదు. అన్నీ లాకర్‌లో పెట్టారో.. అలా ఉంచేశారో నేను అడగలేదు. ఆ బీరువాని తెరిచే అవసరం నాకు రాదు.

ఆ నగల విషయం నాకేమీ తెలియదనగానే నా వేపు చాలా విచిత్రంగా చూసింది. "చూపించటానికి భయపడుతున్నట్లున్నావే?" అంది పెదవుల్ని సాగదీస్తూ.

"భయం దేనికి?" అర్థం కాలేదు నాకు.

"ఎందుకేమిటి... పెద్దత్త చేయించినవేగా అని నాకేదైనా నచ్చినది ఉంటే తీసుకుంటానని అంటానేమోనని ముందు జాగ్రత్తగా చూపించటానికి భయపడుతున్నావ్! తెలుస్తోందిలే!"

నేను నిర్ఘాంతపోయాను.

ఛ...ఛ... రజిత ఇలా ఎలా ఆలోచించగలిగిందీ అనిపించింది!

"నాకు నిజంగానే ఆ నగల గురించి మీ పెద్ద బావకు తప్ప నాకు తెలియదు. అత్తయ్య చేయించిన నగలే కాదు, నాన్న గారు కొన్న వాటిల్లోనయినా నీకు నచ్చింది ఉంటే ఇవ్వటానికి నేనేం బాధపడను... సంతోషంగానే ఇస్తాను!"

"స..రే...లే..." అంటూ వ్యంగ్యంగా మళ్ళీ నవ్వింది. "లేని వాటిని దానం చేసేస్తామని ఎవరైనా ధారాళంగా చెప్పొచ్చు! అం..త ఖరీదైన నగల గురించి నీకేం తెలియదంటే నేను నమ్మాలన్నమాట! పైగా నగలంటే ఇష్టం లేదని చెప్పి పెట్టుకోకుండా ఎవరికంటా పడకుండా జాగ్రత్త పడుతున్నావ్!"

సమాధానం చెప్పాలని కూడా అనిపించలేదు. నిర్లిప్తంగా చూసి ఊరుకున్నాను. నా గురించి తన అభిప్రాయం అదే అయితే... కాదంటూ నేను వాదించడమెందుకూ...!

* ❀ *

ఆ నగల గురించి విష్ణునడిగాను.

విష్ణు కాసేపు ఆలోచనలో పడిపోయి నిశ్శబ్దంగా ఉండిపోయారు. రెండు క్షణాల తర్వాత అసలు విషయం నాకు తెలియటమే మంచిదనుకున్నారేమో చెప్పారు.

ఆ నగలు లాకర్‌లో కూడా లేవట. లాకర్ నుంచి తీసి ఆ నగల్ని విష్ణుకు బాగా తెలిసిన శేర్ దగ్గర హామీగా ఉంచి కృష్ణప్రసాద్ పెళ్ళికోసం అప్పు తెచ్చారు. ఈ విషయం విష్ణుకు తప్పించి ఇంట్లో వాళ్ళెవరికీ అత్తయ్యకు కూడా తెలియదు.

"పెళ్ళి ఘనంగా చేయాలనే కోరిక ఉన్నా అప్పు చేయటానికి అమ్మ ఇష్టపడక పోవచ్చు. అలాంటి పరిస్థితి వచ్చినందుకు బాధపడుతుంది. అందుకే అమ్మకి చెప్పటం నాకిష్టం లేదు. బిజినెస్ వ్యవహారాల్లో సర్దుబాటు చేసుకోవటానికే పెద్ద మొత్తంలో కావల్సిన అప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. పెళ్ళి ఖర్చుల కోసమూ ఎక్కడో అప్పు చేసే ఇబ్బంది కంటే ఇలా నగల్ని ఉంచటమే బావుంటుందనుకున్నాను. ఒకటి రెండు సంవత్సరాల్లో పరిస్థితి అంతా చక్కబడుతుందనే నమ్మకం నాకు పూర్తిగా ఉంది! ఇంతలో ఈ అప్పుల గురించి అమ్మకి తెలియజేయటం ఎందుకనిపించింది. ఎవరికీ తెలియకపోవటం నీ కిబ్బందిని తెచ్చిపెడుతుందనే ఆలోచనే నాకు రాలేదు!" అంటూనే విష్ణు నా చేయి పట్టుకొని క్షమాపణ అడుగుతున్నట్లుగా "అవును సుజీ... నేను తప్పు చేశాను..." అన్నారు.

"ఫరవాలేదు" అన్నట్లుగా చూశాను.

ఇం... త పెద్ద ఇల్లూ... నౌకర్లు చాకర్లూ.. కార్లూ... ఇంత హంగామా ఉన్న వాళ్ళకి కూడా అప్పు చేయాల్సిన పరిస్థితులా...?!

ఎంత చెట్టుకి అంత గాలి అంటే ఇదేనేమో!

ఉన్నవాళ్ళకైనా, లేని వాళ్ళకైనా ఏ వేడుక అయినా వీలైనంత అట్టహాసంగా చేయాలనే అనిపిస్తుందన్నమాట! నాలాంటి ఏ కొద్దిమందికో మాత్రం అనవసరమనిపిస్తుంది! నాకు ఇలా అనిపించటానికి కారణం నాన్నగారి ఆలోచనల ప్రభావం నా మీద ఉండటమే కాబోలు!

విష్ణు చేసింది మంచి పనే! నా ద్వారానూ ఈ విషయం ఎవరికీ తెలియకూడదనుకున్నాను. రజిత ఏమైనా అనుకోనీ... విని ఊరుకోవటమే!

✻ ❀ ✻

నాలుగు రోజుల తర్వాత...

అత్తయ్య గదిలోని బీరువాలో ఉండే శాంతమ్మ గొలుసు కనిపించటం లేదని అనుకోవటం విన్నాను. ఇక్కడకు వచ్చేటప్పుడు తనకి పుట్టింటి వాళ్ళిచ్చిన ఆ గొలుసును తీసుకు వచ్చింది. దాయమని అత్తయ్యకి ఇచ్చింది. ఆ రోజు ఎందుకనో భరిణెలో చూస్తే అత్తయ్యకు కనిపించలేదు. ఎలా పోయి ఉంటుందని అందరూ తర్జన భర్జనలు పడుతున్నారు.

నీరజ డ్రెస్‌లు కొనుక్కోవాలని నన్ను రమ్మంటే సరేనని రెడీ అయ్యాను. కారు లేదు. రజిత తీసుకెళ్ళింది. తను వచ్చాకనే వెళ్దామని ఇద్దరం హాల్లో టివి చూస్తూ కూర్చున్నాం.

రెండు మూడురోజుల క్రితం బీరువాకే తాళాలు వేలాడుతూ ఉంటే తనే అలా మరిచిపోయానేమో అని అత్తయ్య అనుకున్నారట! కానీ ఇప్పుడు ఆలోచిస్తే... ఎవరో ఆ రోజు బీరువా తీశారనిపిస్తోందని అత్తయ్య వచ్చి అక్కడే ఉన్న చిన్నత్తయ్యతో అన్నారు.

ఎవరు తీస్తారు... ఎందుకు తీస్తారు... కొత్తవాళ్ళెవరూ రాలేదు.. వచ్చినా గదుల్లోకి వెళ్ళే అవకాశమే లేదుగా అంటూ ఇద్దరూ మళ్ళీ చర్చలో పడ్డారు.

ఇంతలో ఫోన్ మోగడంతో నీరజ తీసి అత్తయ్యకి కార్డ్‌లెస్ అందించింది.

ఎందుకోగానీ ఫోన్‌లో మాట్లాడుతున్న అత్తయ్య మొహం వివర్ణమైంది!

రెండు నిముషాలు విని మెల్లగా ఏదో అడిగారు. ఆ తర్వాత ఏదో చెప్పి ఫోన్ ఆఫ్ చేశారు.

చిన్నత్తయ్య "ఏమిటక్కయ్యా... ఎవరు చేశారు... సంగతేమిటీ?" ఆరా తీశారు.

అత్తయ్య మొహం కోపంతో జేవురించింది. అత్తయ్యలో అంత కోపాన్ని చూడటం అదే మొదటిసారి.

"శాంతమ్మ గొలుసు చమన్‌లాల్ షాపుకి చేరింది. రజిత అది చెడగొట్టి ఇంకేదో కొత్తరకం నెక్లెసు చేయమని పురమాయించిందట. ఆరోజు వాళ్ళబ్బాయి షాపులో ఉన్నాడు. ఇప్పుడు ఈయన చూసి ఈ రకం గొలుసు ఇప్పుడు మళ్ళీ ఫ్యాషనైందని,

ఇది అలాగే ఉంచి కొత్త బంగారంతో నెక్లెసు చేయించుకోవచ్చు కదా అని అడగటానికి ఇప్పుడు ఫోను చేశారు. గొలుసుకున్న బిళ్ళ మీద శాంతమ్మా వాళ్ళ అమ్మ పేరు 'మునెమ్మ' అని ఉంటుందిగా, ఆ విషయం అడిగితే ఉందన్నాడు. అది పంపించెయ్యమని, కొత్త బంగారంతోనే రజిత ఆర్డరిచ్చిన నెక్లెసు చేయమని చెప్పాను" అన్నారు.

"అదేమిటి... నీకు మాట మాత్రం చెప్పకుండా రజిత ఇలా ఎందుకు చేసిందీ...!" ఆశ్చర్యంగా చిన్నత్తయ్య అన్నారు

అత్తయ్య ఏం మాట్లాడకుండా కూర్చున్నారు. చాలా అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాసేపటిలోనే, షాపు కొంచెం దగ్గరే కాబోలు చమన్‌లాల్ గుమాస్తా వచ్చి గొలుసు ఇచ్చి వెళ్ళిపోయాడు.

కాసేపటికి రజితా వచ్చింది.

అత్తయ్య కొంచెం గట్టిగానే నిలదీశారు. "శాంతమ్మ గొలుసు ఎలా పోయిందని అందరం తలలు బద్దలు కొట్టుకుంటుంటే... తీసానని చెప్పవేం? ఆ గొలుసు చెడగొట్టటమెందుకని చమన్‌లాల్ ఫోను చేసేవరకు ఈ సంగతి తెలియనే లేదు".

రజిత మొహం చిట్లించి చూసింది. "అది శాంతమ్మ గొలుసా? ఆవిడ పెట్టెలోది పోయిందేమో వెతుక్కుంటున్నారనుకున్నా. శాంతమ్మది నీ బీరువాలో ఉండటమేమిటి? అసలు చమన్‌లాల్ వాళ్ళు నీకెందుకు ఫోను చేశారు. నాకు చేయాలి గానీ?"

"నిన్ను మాత్రమే అడగాలనే సంగతి ఆయనకు తెలిసి ఉండదు! ఇంట్లో పెద్దవాళ్ళున్నపుడు వాళ్ళకీ ఒక మాట చెప్పటం మర్యాదే కానీ తప్పు లేదని ఎవరైనా అనుకుంటారు. ... నీకు మాత్రం తెలియలేదు గానీ!" అత్తయ్య మాటలు తీక్షణంగానే ఉన్నాయి.

రజిత రోషంగా ఉరుముతున్నట్లుగా చూసింది. "నాకు తోచినట్లు, నా ఇష్టప్రకారమే ఏదైనా చేస్తాను! ఎవరి సలహాలు నాకవసరం లేదు! మొదటి నుంచీ నా పద్ధతి ఇదే. ఇప్పుడు కొత్తగా నా అలవాటును మార్చుకోను!" చాలా నిక్కచ్చిగా చెప్పింది.

"ఏదైనా నీ ఇష్టప్రకారమే చేసుకో... నన్నడగాల్సిన పనిలేదు. కానీ బీరువాలో గొలుసు తీసి దాన్ని మార్చాలనుకుంటే నాకో మాట చెప్పనవసరం లేదా? చెప్పి ఉంటే అది శాంతమ్మ గొలుసని తెలిసి ఉండేదిగా?"

"ఏ కొత్త ఫ్యాషన్ నగ వచ్చినా వెంటనే కొనుక్కోవటం నా కలవాటు. చినబావనడిగితే ఇప్పుడు కాదనేశాడు. నీ దగ్గరికి వస్తే స్నానం చేస్తున్నావు. డబ్బు కోసం బీరువా తెరిస్తే అది కనిపించింది. పాత గొలుసెందుకని మార్చెయ్యాలనుకున్నాను. ఈ మాత్రం దానికే ఇంత రాద్ధాంతం చేస్తున్నారు! ఎంతైనా ఖర్చు పెట్టుకునే హక్కు నీ పెద్దకోడలికే కాదు, నాకూ ఉంది!"

"మధ్యలో ఇంకొకరి ప్రసక్తి నీకెందుకూ?" చాలా నెమ్మదిగా అన్నారు.

"ఈ ఇంట్లో విషయాలు నాకూ అవసరమే! నాకివ్వటానికి చిన బావ దగ్గిర డబ్బు ఉండటం లేదు. పెదబావదే పెత్తనం కాబట్టి ఆవిడ ఎంతైనా ఖర్చు పెట్టుకోవచ్చు కాబోలు! ఆఫ్టరాల్... ఒక డ్రైవరు బంధువులకే లక్ష రూపాయలు దానంగా ఇచ్చేసిందంటే.. ఆ లెక్కన సొంతానికి ఇంకెంత ఖర్చు చేస్తోందో ఎవరూ పట్టించుకోరా..? వాళ్ళ నాన్న బడిపంతులు కాకపోయి ఉంటే అదంతా వాళ్ల నాన్న ఇచ్చిన డబ్బేనని గొప్పలు కూడా చెప్పుకునేదేమో..."

రజిత మాటలకు నేను హతుశురాలినయ్యాను.

మధ్యలో అనవసరంగా నా ప్రసక్తి తీసుకువచ్చింది. రెండు రోజుల క్రితమే కాశీ వాళ్ళకు చెక్కు ఇచ్చాను. ఏ డ్రైవరో రజితకు చెప్పి ఉండొచ్చు. నేను నీరజతో కానీ రజితతో గానీ ఈ మాట అనలేదు. రహస్యమని కాదు. అలాగని అందరికీ చెప్పాల్సిన అవసరం ఉందనీ నేను అనుకోలేదు. ఇప్పుడు ఈ విషయాన్నే ఆధారం చేసుకొని రజిత అవమానకరంగా ఆరోపణలు చేస్తోంటే.. ఏం చేయాలో.. ఏం మాట్లాడాలో తోచక విమూఢిరాలిలా చూస్తుండిపోయాను.

అత్తయ్య నన్నీ స్థితి నుండి కాపాడతారని నేనసలు ఊహించలేదు!

"నిజంగానే... నువ్వు నమ్మకపోయినా ఆ డబ్బు సుజనకు వాళ్ళ నాన్నగారు ఇచ్చిందే! విష్ణు ఇవ్వలేదు. నీకు డబ్బు కావల్సి వస్తే నన్నడుగు... కృష్ణనడుగు. అంతేగానీ అనవసరమైన విషయాలు మాట్లాడకు. పెళ్ళికీ మధ్యనే నగలు కొన్నారు గదాని ఇప్పుడు అనవసరమని కృష్ణ లేదన్నాడేమో..."

అలసిన శరీరానికి చందన పూతలా... అత్తయ్య మాటలు నా మనసుకి సాంత్వననిచ్చాయి! ఆఫీసు నుండి రాగానే ప్రతీ రోజూ అరగంట సేపయినా విష్ణు అత్తయ్య దగ్గిర కూర్చుని అన్ని విషయాలూ మాట్లాడతారని తెలుసు. ఈ సంగతీ చెప్పారన్నమాట!

"ఓహో... నీకూ తెలుసన్నమాట! బిజినెస్ చేస్తూ కోట్లు సంపాదిస్తున్న మానాన్నే నాకివ్వలేదు గానీ చిన్న ఉద్యోగంతో బ్రతికే ఆయన లక్షల్లో ఇచ్చాడని చెబితే నీలా నమ్మటానికి నేనంత తెలివి తక్కువదాన్ని కాదు! డబ్బు కోసం దేవిరించాల్సిన పరిస్థితి నాకేం లేదు! ఒక్క ఫోన్ చేస్తే మానాన్నే పంపించగలడు. కాకపోతే మీ పరువు బజార్న పడెయ్యటమెందుకని ఊరుకొన్నాను. పెద్దత్తా... ఇప్పుడే చెబుతున్నాను. ఏం అన్నా నీ పెద్దకోడల్లా నేను పడి ఉంటానని అనుకోకు. నేను తనలా పైసా పైసా లెక్క పెట్టుకునే కుటుంబం నుండి వచ్చిన దాన్నికాదు... నీకు తెలుసు... మా ఇద్దరికీ చాలా తేడా ఉంది!" గొంతు పెంచి రోషంతో రెచ్చిపోతున్నట్లుగా మాట్లాడింది.

నిర్ఘాంతపోయినట్లుగా రజిత వేపు చూస్తూ నిలబడి అత్తయ్య చాలా నెమ్మదిగా "అవును .. చా... లా... తేడా ఉంది! తెలియజేస్తున్నావ్‌గా. ఇప్పుడే తెలిసింది..." అంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

కొంచెం దూరంగా ఉన్న ముత్యాలు ఎందుకోగానీ కిసుక్కున నవ్వింది. అక్కడే ఉందో, లేక అప్పుడే వచ్చిందో నేను గమనించలేదు.

"ఎందుకే నువ్వు నవ్వుతున్నావ్... అసలు ముందు నిన్ను తన్నాలి... ఇల్లంతా ఇష్టం వచ్చినట్టు తిరుగుతూంటావ్!" అంటూ చేయెత్తి ముత్యాలు దగ్గరికి వెళ్ళింది రజిత.

"మద్దెలో నేనేటి చేశానూ...నన్నెందుకు కొట్టాలీ..." అని పరుగులు పెట్టిన ముత్యాలు వెనుకే రజిత వెళ్ళింది.

రెండు నిముషాల్లోనే బుసలు కొడుతున్నట్లుగా ఈజీ ఛైరును చేత్తో పట్టుకుని వచ్చిన రజిత దాన్ని హాలు ద్వారం బయట వేసుకొని కూర్చుని నీరజతో "ఈ పిచ్చిదాని నోటికి హద్దూ పద్దూ లేదు... ఎంత మాటయినా అనేస్తుంది... ఇదెంత.. దీని బ్రతుకెంత.. నన్ను దొంగ అంటుందా..?! వెళ్ళి పెద్దత్తతో చెప్పు... ఈ ఇంట్లో అది ఉండటానికి వీల్లేదు.. దాని పంపించేస్తే గానీ నేను లోపలకి రాను..!" అంది.

వెనకే వచ్చిన ముత్యాలు "అయ్యో... ఇదేటి నేను మిమ్మల్నెందుకంటానూ... నన్ను కొడతానంటే ... నేనేమన్నా బంగారం, ఎండి దొంగతనం చేశానా... ఎందుకొడతరన్నా... అంతేగందా...!" అంది.

నీరజ ఏదో అనబోతుంటే "నువ్వెళ్ళి పెద్దత్తకి చెప్పు..." ఉరిమినట్లే అంది.

మారు మాట్లాడకుండా నీరజ పరుగు పెట్టింది.

అత్తయ్య వెంటనే వచ్చారు. మొహం బాగా నీరసంగా, దస్సిపోయినట్లు ఉంది. కొంచెం చిరాకుగా చూస్తూ "రజితా.. ఏమిటిది ...పిచ్చిదాని మాటలకి అర్థం లేకుండా ఈ రాద్ధాంతం ఎందుకూ...?" అన్నారు.

"దానికి పొగరు బాగా పెరిగింది. అది ఇంట్లో ఉండకూడదు!"

"ఏం మాట్లాడకూడదో... ఎలా మాట్లాడాలో దానికి తెలియదు. దానితో నీకు పంతం ఏమిటి?"

"ఏం తెలియదని అనుకోవటం లేదు. అన్నీ తెలుసనుకుంటోంది. బయటకు పంపిస్తే దాని పరిస్థితి ఏమిటో తెలుసుకుంటుందప్పుడు!"

"ఎక్కడికెళ్తుంది.. దానికి ఎవరూ లేరమ్మా..." హఠాత్తుగా అత్తయ్య కంఠం భారమైంది.

"ఎవరూ లేనివాళ్ళుండటానికి ఇదేం అనాధాశ్రమం కాదు! నన్ను ఎదిరించి మాట్లాడిన పనిమనిషిని పంపించటానికి ఇంత ఆలోచనా? నీ మెత్తదనం చూసే అదలా నెత్తికెక్కుతోంది! నా ఇష్టప్రకారం ఒక పనిమనిషిని కూడా బయటకు పంపించలేకపోతే.. కోడలిగా ఈ ఇంట్లో నాకు పరువేం ఉన్నట్లూ..?" నిలదీసింది.

ఇక నిలబడలేనట్లుగా లోపలకి వచ్చి సోఫాలో కూర్చుని నీరజతో "దీనికేమైనా డబ్బులిచ్చి పొమ్మని చెప్పవే..." అని బిక్కు బిక్కుమంటూ చూస్తూ నిలబడిన ముత్యాల్ని చూసి "ఇంకా ఎందుకే అలా నిలబడ్డావ్.. వెళ్ళి నీ బట్టలు తీసుకొని పో..." అంటూ కసిరారు.

"నిజంగానే పొమ్మంటున్నారా?" చాలా దీనంగా అడిగింది.

"నిజంగానే చెబుతున్నాను... వెళ్ళు... ఎవరో ఒకరు నీకింత ముద్ద పెట్టకపోరు..." తల తిప్పుకున్నారు.

అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిన ముత్యాలు రెండు నిముషాల్లోనే చిన్న మూటతో వచ్చింది.

నీరజ డబ్బివ్వబోతే "నాకు డబ్బులెందుకూ... ఎవరో ఒకరు ఇంత ముద్ద పెడతారని పెద్దమ్మగారు సెప్పారు..." అంటూ తీసుకోలేదు.

అక్కడే ఉన్న అందరి వంకా మార్చి మార్చి చూస్తూ "పోతన్నానమ్మ..." జాలిగా అంది.

"పిచ్చిది.. ఏడకి పోతదనుకోకుండా పొమ్మంటున్నారు.... నేను చచ్చే వరకూ పూచీ మీదని మా అమ్మకు మాటిచ్చి... పెద్దమ్మగారూ... ఇప్పుడు పొమ్మంటున్నారా... సరే.. పోతాలెండి..." వెనక్కి వెనక్కి చూసుకుంటూ అడుగులేసింది.

అందరి కళ్ళూ చెమర్చాయి.

అత్తయ్య చెంపల మీదుగా కన్నీళ్ళు ధారలు కట్టేశాయ్!

"పిచ్చిదానివయినా... ఏడిపించటం మాత్రం నీకు బాగా తెలుసు.." కళ్ళు తుడుచుకుంటూ లేచి వెళ్ళిపోయారు.

"చివరకు .. ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టుగా అయింది... " మెల్లగా గొణుక్కుంటూ చిన్నత్తయ్య లేచారు.

లోపలకు దర్పంగా వచ్చి కూర్చున్న రజిత "శాంతమ్మా.. కాఫీ..." అని కేక పెట్టింది.

శాంతమ్మ గొలుసు తీసిందని అత్తయ్య గట్టిగా మాట్లాడినందుకు ఆ కోపం ఇలా ముత్యాలు మీద చూపించింది కాబోలు!

ఎవరో దగ్గిర బంధువు దూరమైపోతున్నట్లుగా అత్తయ్య ముత్యాలు కోసం అంతగా కదిలిపోయి కన్నీళ్ళు పెట్టుకోవటం నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది! అత్తయ్య పట్ల గౌరవం మరింత పెరిగింది!

కాఫీ కప్పు తెచ్చిన శాంతమ్మ కళ్లు ఎర్రబడి ఉన్నాయి.

రజిత కాఫీ తాగుతుంటే, నీరజ, నేను టివికి కళ్ళు అప్పగించి కూర్చున్నాం ఏం చేయాలో తోచనట్లుగా.

పదినిమిషాలు గడిచాయో, లేదో ఇంటి ముందు కారు ఆగిన శబ్దం వినిపించింది.

పెద్ద పెద్ద అడుగులతో లోపలకి వచ్చిన విష్ణు "అమ్మా.. " అంటూ కేక పెట్టారు.

అప్పుడు.. ఆ సమయంలో విష్ణు ఎందుకు వచ్చారో, అంత ఆగ్రహం ఏమిటో అంతుబట్టలేదు.

మళ్ళీ వెంటనే ఇంకో కేక.

హడావుడిగా అత్తయ్య, వెనకే చిన్నత్తయ్య వచ్చారు.

"ఏమిటమ్మా – పిచ్చిదాన్ని పొమ్మన్నావా..? ఎక్కడికి వెళ్తుందనుకున్నావ్.. ఎలా బ్రతుకుతుందనుకున్నావ్...?" తీవ్రంగా అన్నారు.

రజిత లేచి నిలబడి "బావా .. ఆ పిచ్చిది.. నన్ను" అని చెప్పబోతుంటే విష్ణు "రజితా.. నువ్వేం మాట్లాడకు..." ఉరిమినట్లే అన్నారు.

రజిత కొంచెం బెదిరినట్లుగా మౌనంగా ఉండిపోయింది.

విష్ణు పెదవుల పైకి చిరునవ్వు వచ్చింది.

"మమ్మల్నెవరినైనా బయటకు పొమ్మనే అధికారం నీకుంది గానీ ముత్యాల్ని మాత్రం పొమ్మనటానికి లేదు. తనకా హక్కును నాన్నగారే ఇచ్చారు కదా!" మళ్ళీ కొంచెం సీరియస్‌గా చూస్తూ "నేను లాయరు గారిని కలవాలని అటు వేపు వెళ్తున్నాను కాబట్టి సరిపోయింది. మలుపులో చెట్టు క్రింద కూర్చునుంది. లేకపోతే వెతకలేకెంత గొడవయ్యేదో! అయినా ఎవరో ఏదో అంటే... నువ్వు గట్టిగా మట్లాడలేవా..." అంటూ విష్ణు వెంటనే వెళ్ళిపోయారు.